

# పీడ

పెద్దింటి అశోక్‌కుమార్

కైలాబ్‌కు ఆగమాగంగా ఉంది. చేసింది కరెక్టేనా అనుకుంటున్నాడు. అలా చేయాల్సింది కాదేమో అనుకుంటున్నాడు. చేయక ఇంకేం చేయాలి అని కూడా అనుకుంటున్నాడు.

అనుకుంటూనే జీబును పీరీల మసీదు దగ్గరికి తెచ్చి ఆపాడు. రోజూ ఇంటి ముందు కనిపించేదే అయినా ఈరోజు ఎందుకో కొత్తగా కనిపిస్తోంది జీబు. పామున్న పుట్టలా ముట్టుకుంటేనే బుగులైతోంది. రోజుకు రెండువందల కిరాయి కట్టాలెగదా మరి!

"ఏంరా... కైలాబూ... నువ్వచ్చినవు. మీ అయ్య లేడారా!..." సత్తయ్యసేటు జీబులో కూసుంటూ అడిగాడు. వెంట రెండు జోర సంచులున్నాయి. సామాన్లు తేవడానికి గొల్లపెల్లికి పోతున్నాడు.

"ఇగ యాడికస్తడు. జీబు ఇప్పుడు కైలాబు గానిదే... వీడో రెండేండ్లు నడుపుతడు," యాదగిరి అన్నాడు జీబెక్కుతూ.

"అగో... అయ్యదో మావులా కొడుకుదో మావులానా... ఏంది బిడ్డా లగ్గం అయి కాకతలిగెనే ఏరు వడ్డవా...?" ఎత్తిపొడుతున్నట్టు అంటూ ఎక్కి కూసుంది తిరుమలవ్వ.

"ఏరుపడ్డవా... మన్నా... అదో కథ. రెండేండ్ల వాయిద నిండింది. బుచ్చిరెడ్డి సంగతి తెలుసుగదా... ములిక్కాయకు ముండ్లెన్ని అంటే కాకరకాయకు కండ్లెన్ని అంటడు. నెలకింత కిరాయి పెంచిండు. అయ్య సాలిచ్చుకుంటే కొడుకు గుత్త వట్టుకున్నడు," యాదగిరి అన్నాడు ముందుకు జరుగుతూ.

ఈ మాటలేవీ వినడంలేదు కైలాబ్. జీబును ఆనుకుని నిలబడి, "గొల్లపల్లి... సిరిసిల్ల... గొల్లపల్లి... సిరిసిల్ల..." అంటున్నాడు. అలవాటులేని అరుపు. కొత్తగా ఉంది. కొద్దిగా బిడియంగా కూడా అనిపించింది. అందరూ తననే పట్టిపట్టి చూపిస్తున్నట్టుగా అనిపించింది. ఒకసారి మెలితెమ్మైతే బిడియం ఉండదని వరుసగా అంటున్నాడు. గొంతు బొంగురుగా ఉంది.

కైలాబ్ అసలు పేరు స్కైలాబ్. అందరూ కైలాబ్ అనే పిలుస్తారు. సరిగ్గా స్కైలాబ్ పడిన్నాడే పుట్టాడని ఆ పేరు పెట్టారు. కొత్తవాళ్ల ముందు పేరు చెప్పడానికి కొద్దిగా సిగ్గనిపించి తన పేరు మార్చుకోవాలనుకున్నాడు కైలాబ్. కాని అప్పటికే అతడి పేరు శిలాశాసనమైంది.

ఇద్దరు కాలేజి పిల్లలు కూడా ఎక్కి కూచున్నారు. ఒకలతో ఒకలు ముచ్చటలో మునిగిపోయారు. కైలాబ్ 'గొల్లపల్లి... సిరిసిల్ల' అంటూ అరుస్తనే ఉన్నాడు.

"ఒరేయ్... ఐదుగురు నిండింద్రు. జీబు పోనీ..." సత్తయ్యసేటు గదమాయింపుగా అన్నాడు.

"ఏంబోతది సేటూ... ఒక్కలన్నా సిరిసిల్ల ప్యాసింజరుగాదు. నడుమల దిగుతరు. డీజిల్ ఖర్చుగాదూ... ఆ... సిరిసిల్ల... సిరిసిల్లా," అన్నాడు కైలాబ్.

"ఆటో వచ్చిందనుకో ఈ ఐదుగురు గూడా దొరుకరు. నీ బుద్ధి," యాదగిరి అందుకున్నాడు. "వీళ్ల నాయిన ఇట్లగాదు. ఇద్దరెక్కినా దంచుకపోతుండె," తిరుమలవ్వ అన్నది.

"మా కాలేజీకి టయిమయింది. నడువని," కాలేజీ పిల్లలు అన్నారు. మొత్తం మీద అందరూ అన్ని రకాల ఒత్తిడిని చేస్తున్నారు. కైలాబ్ మాత్రం వారిచ్చే

ఛార్జీలు లెక్కగట్టుకుని ఇంకో నలుగురు ఎక్కితేగానీ కదలకూడదని నిర్ణయం చేసుకున్నాడు.

కైలాబ్‌కిది కొత్తగా ఉంది. అతడెన్నడూ తండ్రి వెంట పోలేదు. లారీమీదనే ఉన్నాడు. అక్కడ ఈ గొడవ లుండయి. బొబ్బలుండయి. ఇప్పుడు ఇదేం పీకులా టరా అనుకుని కొద్దిసేపు బానెట్ ఎత్తి ఇంజన్ సదిరి నట్టు చేశాడు. మరికొంతసేపు నీళ్లు పోశాడు. ఇవన్నీ చేస్తూనే ఒక కంట ఎవరైనా ఎక్కుతున్నారా అని చూస్తు న్నాడు. పురుగులేదు. అతడు కావాలనే సదురుతున్నా డని గమనించారు కూర్చున్నవారు.

ఇద్దరు సేట్లు సామాన్ల లిస్టులిచ్చిపోయారు. పోయేప్పుడు గొల్లపల్లి పెద్ద దుకాణంలో ఇస్తే వచ్చే ప్పుడు ముల్లెగట్టి జీబులో వేస్తారు. లిస్టును జేబులో వేసుకుంటూ, "సిరిసిల్ల... సిరిసిల్లా..." అన్నాడు కైలాబ్.

"ఇప్పుడొక ఆటో వచ్చుగద పోరని రోగం కుదురుతుండె. తొవ్వపొంట మత్తు మందెక్కుతరు. పోనియ్యి," తిరుమలవ్వ గదుమాయించింది.

ఆటో పేరు వినగానే వెన్నులోపల జిల మొదల యింది కైలాబ్‌కు. ఆటోకు నలుగురైదుగురు ప్యాసిం జర్లయితే చాలు. జీబుకు పది పన్నెండుమందైనా కావాలి. కొద్దిమంది జమకూడగానే ఆటో రావడం జీబు ఖాళీ కావడం... ఈ విషయం రోజూ తండ్రి చెబుతుంటే విన్నాడు. అందుకే భయమేసింది.

"చాట్ల తౌడు పోసింద్రు. కుక్కలకు ఎగేసింద్రు... థూ... నీయవ్వ..." అనుకుంటూ జీబు ఎక్కబోతూ ముందుకు చూశాడు కైలాబ్. గుండె ధడేలుమంది.

బయపడ్డంతా అయింది. మూడుగీరల ఆటో వచ్చి ఆగింది. హారన్ మోగింది. అది బయట కాదు. కైలాబ్ గుండెలో మోగింది. జీబులో కూసున్నవారి కళ్లలోనైతే చెప్పలేని ఆనందం. మనుషులు ఇంత పైశాచికంగా ఆనందిస్తారని అతడికి తెలుసు. వాళ్ల చూపులను తట్టుకోలేకపోయాడు. అప్పటికి తిరుమ లవ్వ అననే అన్నది.

"మంచిగైంది తాతకొడుకా... లేనిదానికి ఆశ పడితే ఉన్నది ఊసిపాయె. ఇప్పుడుగూడా నడువ లేదనుకో... ఆటో ఎక్కుతం..." ఆమె మాట్లాడ్డం అయి పోనేలేదు కాలేజి పిల్లలు లెవ్వనే లేశారు.

"పోదాం... కూసోంద్రి..." అంటూ స్టార్ట్ చేసి రివర్స్‌లో వెనక్కి తిప్పుతూ, "ఇట్లయితే నేను కిరాయి కట్టినట్టే," అన్నాడు. అతడి మాటలు జీబు శబ్దంలో కలిసిపోయాయి.

ఆగమాగాన గేరు మారుస్తుండంగ ఇద్దరు టీచర్లు కనిపించారు. వాళ్లు ఆటోవైపు వెళ్తున్నారు. "రాంద్రి సార్... ప్యాట్లకే గదా బడి ముందు దించుతా," అభ్యర్థ నగా చూస్తూ అన్నాడు కైలాబ్.

"మాది క్యాట్ కార్డ్... రూపాయి తక్కువిస్తం. కాదంటే అరగంటలో బస్సుంది. దిగేప్పుడు గింత గంతంటవని ముందుగనే చెప్పుతున్న. మొన్నగట్లనే కిరికిరయింది" ఒక టీచర్ అన్నాడు. మరో టీచర్ సమా ధానం కొరకు ఆగి చూస్తున్నాడు. ఇద్దరిని ఏ రేటుకైనా సరే ఎక్కించుకుని జీబు కంటే ముందు వెళ్లాలని ఆటో డ్రైవర్ చూస్తున్నాడు.

తప్పనిసరై కైలాబ్ 'సరే' అన్నాడు వాళ్లిద్దరూ ఎక్కి కూర్చున్నారు. జీబు కదిలింది.

"ఇగో... కైలాబూ ఇప్పుడే చెబుతున్న. వాళ్లు ఇచ్చినంతనే మేమిస్తం. ఒకలకు ఎక్కువేంది...? ఒక లకు తక్కువేంది? మేం మనుషులమే కదా...? మాయి పైసలే కదా...?" సత్తయ్య సేటు అన్నాడు. అతడు 'మేము' అన్నాడు కాబట్టి మిగిలినవారు, 'ఔ... అట్నే తీసుకోవలె,' అన్నారు. ఈ విషయం తమది కాదన్నట్టు మౌనంగా కూర్చున్నారు టీచర్లు.

కైలాబ్ మెదడు క్యాలిక్యులేటర్‌లా పనిచేసింది. టీచర్లు ఎక్కక ముందు ఎంత వచ్చేదో అంతే వచ్చింది. గుండె మెలిపెట్టినట్టయింది. తను వేసుకున్న టార్గెట్ వేరు. వచ్చింది వేరు. రోజూ ఇదే కథ జరిగేట్టుంది. మరి ఎట్లా కూడబెట్టేది!

కైలాబ్‌కు తండ్రి గుర్తుకొచ్చాడు. ఉరుకులు పరుగులు చేసే అతడి హడావుడి గుర్తొచ్చింది. ఈమధ్య బెల్లంకొట్టిన రాయిలా మారాడు. చేతిలో జీబు లేక పోవడమే అని తను అనుకున్నాడు. అంతకుమించి అతడి గుండెను మెలితిప్పిన బాధ ఏమిటో ఇప్పుడిప్పుడే బోధపడుతోంది.

గేరు మార్చి జీబు వేగాన్ని పెంచాడు కైలాబ్. ఎట్ల యితే అట్లయితది. బండ కింద చెయ్యి జిక్కింది. మెల్లగ ఒదులదీసుకోవాలె అనుకున్నాడు. బటన్ నొక్కితే టేపులో పాట మొదలయింది. "దోస్తర బన్ నేస్తమా... దోస్తు గట్టుకుందమా..." పాట. టీచర్లిద్దరూ చిటికెలేస్తున్నారు. ఉనికిని మరిచి ప్రపంచబ్యాంకు అప్పుల గురించి మాట్లాడుకుంటున్నారు. అది రాష్ట్రాన్ని దత్తత తీసుకుందని రాబోయేకాలంలో బతుకు గోరం గా ఉంటుందని ఒక్క గొంతుతో ఆమోదిస్తున్నారు.

కైలాబ్‌కు నవ్వొచ్చింది. ఎక్కడ మంది కనిపించినా స్లో చేసి 'సిరిసిల్ల... సిరిసిల్ల...' అంటూ ఆశ నిరాశతో ఊగులాడుతూ ఊరు దాటిండు. ఎవరో కేక వేస్తే తన కొరకే అన్నట్టుగా ఆపిండు. కేక వేసిన వ్యక్తి జీబును దాటిపోతుంటే ఉసూరుమని కదిలిండు.

తను జీబును తీసుకోవాల్సింది కాదు. కాగితాలు సంతకాలయ్యాక ఇప్పుడేం చెప్పస్తది. నిజానికి తను తండ్రి కోసమే తెగాయించి తీసుకున్నాడు. నాలుగు రోజులు జీబు దూరమైతే సంటి పిల్లగాని లెక్క ఏడ్సుకుంట కూసుండె. మంచంబట్టి లెవ్వకనేపాయె. ఇట్ల నన్న కొలుకుంటడని బరువు ఎత్తుకున్నట్టాయె. ఆయన ఏమనుకున్నడో... లేని పొరుక పెట్టుకవచ్చినవని తిట్టని తిట్టు తిట్టె. ఇప్పుడు ఎటూగాని బతుకాయె. బాధగా మూల్గాడు కైలాబ్.

కంకర తేలిన రోడ్డు. జీబు నెమ్మదిగా బోడబండ దాటింది. ఎత్తుగడ్డకు కయ్యలు. గేరు మార్చాడు కైలాబ్. దారి పొడుగునా ఇసుకకుప్పలు, కంకర కుప్పలు.

''వారంలో పని చాలైతదట. డాంబర్ రోడ్డయితే ఈ గోస ఉండది,'' యాదగిరి అన్నాడు. ''గోస ఎప్పుడూ తప్పది. అది ఏదో రూపంలో మనను వెంటాడుతనే వుంటది. గోరంత సౌఖ్యం కొండంత గోసకు పెట్టుబడిలా పనిచేస్తది,'' చూపును మరల్చకుండానే అన్నాడు కైలాబ్ లోతుగా.

టీచర్లిద్దరూ ఉలిక్కిపడ్డారు. మాట్లాడుతున్న మాటల్ని కొద్దిగా తగ్గించారు. మిగిలినవారు మాత్రం మామూలుగానే ఉన్నారు. తిరుమలవ్వనైతే కాస్తంత చొరవగా, ''ఈ రోడ్డు ఎందుకు గావట్టెనని పోరనికి మంటపుడుతుంది. రెండు తీసుకునేకాడ మూడు దొబ్బవడితిరి,'' అన్నది.

''ఏ... పాపం... ఏం సంపాయించుకున్నరు? పూసాపోగు ఉంటే అమ్ముకున్నరు. గడ్డ కింద అద్దెకురం తప్ప యాడేంలేదు. రెండేండ్ల కింద నేనే కాయిదం రాస్తిని. అసలు తప్పు పని చేసింద్రు గనీ అప్పొసప్పొ అప్పుడే చేసి బేంకు మార్జిన్ కడితే ఇప్పుడు జీబు మిగిలిపోతుండె. మూలకున్న బుచ్చిరెడ్డిని తెచ్చి లక్పతిని చేసింద్రు,'' సత్తయ్యసేటు అన్నాడు.

జీబు నర్సింగల్లబోరు ఎక్కి దిగుతోంది. 'అయిదు నిమిషాలాగితే కోరుట్లపేట. అక్కడో పది మంది డైరెక్టు సిరిసిల్ల ఎక్కుదురుగదా ఎంత మంచిగుండు. సిరిసిల్ల చేరంగనే మల్లా ఇరువై మంది దొరుకితే ఇయ్యల్ల మందులు గోలీల ఖర్చు ఎల్లిపోతుండె. నాయినా ఇంత లాభమచ్చిందని సూపిత్తే జర తుర్తిగ ఉంటుండే...' హారన్ చప్పుడు విని సైడ్ అద్దంలో చూశాడు కైలాబ్.

ఆటో దూసుకొస్తోంది. గుండె దడదడలాడింది. వీడు ముందువడితే ఒక్క ప్యాసింజరును మిగులనియ్యడు. ముందే పోవాలి. ఎక్స్‌లేటర్ నొక్కాడు. వేగం అందుకుంది జీబు.

''ఓ పోరడా... జర మెల్లగపోనీ... కడుపుల పేగులు నోట్లెకత్తున్నయి. ఏం ఎత్తేసుడిది'' తిరుమలవ్వ గదమాయించింది. ''...వీనయ్య ఇట్లగాదు. పొట్లమోలె నడుపుతడు, గింత అదులనియ్యడు...'' అన్నది తనే మళ్లీ.

''ఈ జీబు చూస్తే తెలుత్తలేదా... రెండేండ్లు నడిపినా చెక్కుచెదురలేదు. ఒక్కసారి గ్యారేజ్‌కు పోలేదట. పెద్దపెద్ద రిపేర్లయితే బుచ్చిరెడ్డి వంతే... ఒక్క పైస ఖర్చు గాలేదని మురువవట్టె,'' సత్తయ్యసేటు అన్నాడు.

''ఒక్క బుచ్చిరెడ్డి గాదు. బ్యాంకోల్లు గూడా మురిసింద్రు...'' అంటూ టీచర్లవైపు తిరిగి ''ప్రపంచబ్యాంకు ఎవలనేం జేసిందోగనీ సారూ... ఈ గ్రామీణబ్యాంకు మన ఊరిని దత్తత తీసుకున్నదంటే మాలాంటోల్లం ఆగ మైనం,'' అన్నాడు కైలాబ్.

''సద్దిదిన్న రేవు తలువాలెనట. ఈ కరువుల బ్యాంకు పున్యమా అని బుక్కెడు తింటున్నం. బోర్లకు పంపులకు లోన్‌లిచ్చె. కరువున్నదంటె మిత్తిని మాఫీ జేసె. ఇంకేం జెయ్యమంటవు,'' యాదగిరి అన్నాడు కోపంగా.

''దుకాణం పెడుతున్నమంటే ఇరువై వెయిల అప్పు ఇచ్చిండు. తాపకిన్ని కట్టిన,'' సత్తయ్య సేటు అన్నాడు.

''నీకెందుకు సేటు... వెయ్యిగాల్ల జెర్రివి. బ్యాంకుల అప్పు తెచ్చి ఎవలకో మూడు కొత్తల మిత్తికిచ్చినవు. అట్ల లాభమేనాయె,'' అన్నది తిరుమలవ్వ. ''ఇతనొక్కడేగాదు. అప్పు తెచ్చిన అందరూ చేతుల మీదనే తింపుకున్నరు. దాని బరవు అప్పు తీసుకోని వాళ్ల మీద పడ్డది. రద్దిబద్ది రామచిలుక. దొబ్బి బుక్కింది బండారిగాడు అన్నట్టయింది,'' తనే అన్నది.

కైలాబ్ ఆలోచనలు అక్కడే ఆగిపోయాయి. జీబు ముందుకు కదిలినా ఆలోచనలు కదల్లేదు. ఆరోజున తనూ వెంటే ఉన్నాడు. బ్యాంకు చుట్టూ తిరిగారు. ఫోటోలు దిగారు. రెండేండ్ల కింద-

''లొటపెట పెదవులకు నక్క ఆసపడ్డట్టు మేమూ ఆసపడ్డాము. అది అందలేదు, పొందలేదు.

రేపు రా రేనిగాయిత్త, మాపురా మారెడిగాయిత్తనని ఆసపెట్టి ఇయ్యాల్ల ముప్పయివెయిల మార్జిన్ కట్టా లంటారు. ఆ ముప్పయి నా దగ్గరుంటే మీ దగ్గరికి ఎందుకస్త,'' నాయిన అన్నాడు మేనేజర్‌తో బాధగా.

''బ్యాంక్ రూల్స్ అట్లనే ఉంటయి. ముప్పయి డిపాజిట్ చేస్తే మిగతాయి మేమిస్తం. జీబు గావాలం టవు. పైసలేదంటవు. వట్టిగనే వత్తయా...'' బ్యాంక్ మేనేజర్ అన్నాడు.

తండ్రి వెంటే బయటకు వచ్చాడు కైలాబ్. వచ్చాక అనిపించింది కొద్దిగా బతిమాలితే బాగుండేదని. అదే ముచ్చట తండ్రితో అంటే, ''అందులో మనుషులు గాదురా... రూల్స్... రూల్స్ పని చేస్తయట,'' అన్నాడు. అనడానికి అన్నాడుగానీ మనసును చంపుకోలేదు. ఎవలో సలా ఇస్తే బుచ్చిరెడ్డి దగ్గరికిపోయాడు. అప్పు ఇయ్యిమని వివరాలన్నీ చెబితే ఇవ్వననలేదుగానీ కొత్త మాట చెప్పాడు బుచ్చిరెడ్డి.

''నెలకు ఆరువెయిలు బేంక్‌లో కట్టాలి. నువ్వు బతకాలి. నా అప్పు తీర్చాలి. ఒక్క జీబు నడిపి ఇవన్నీ ఎట్ల తీరుస్తవురా...'' అన్నాడు.

ఏదో మనసు చంపుకోలేక వచ్చాడుగానీ లెక్క చూస్తే నిజమేననిపించింది. పైగా బుచ్చిరెడ్డి అప్పు మూడు కొత్తల మిత్తి. నెలకు వెయ్యి. బ్యాంకు అప్పు తీరడానికి రెండేండ్లయితది. అప్పటి వరకు మిత్తికి మిత్తి ఇవి అరువై వెయిలయి కూసుంటయి అనుకున్నాడు. బుచ్చిరెడ్డి కూడా అదే తొవ్వలో ఆలోచిస్తున్నాడు. అప్పు ఇవ్వడానికి మనసొప్పడంలేదు. అలాగని వదలడానికి కూడా మనసొప్పడం లేదు. అందుకే సముదాయిస్తున్న ట్టుగా అన్నాడు మెల్లెగా.

''ఆ తిప్పలేవో నేనే పడతాను. జీబు ఇప్పిస్తాను. నెలనెలా బేంకులో అప్పు కట్టుకో. రెండేండ్ల తరువాత ఆ డొక్కు జీబును నా మొహాన కొట్టేయ్. నా తిప్పలేవో నేనే పడతాను,'' అన్నాడు. పైగా, ''పెద్దపెద్ద రిపేరులైతే డబ్బు నేనే పెట్టుకుంటాను,'' అన్నాడు.

తన చెవుల్ని తానే నమ్మలేకపోయాడు నాయిన. చూసినావురా కైలాబూ బారీగుణం బారీగుణమే అన్నాడు. అప్పుడు తనక్కూడా నిజమే అనిపించింది. ఏ లాభమూ ఆశించకుండా రెండేండ్లు అప్పు ఆగడం, తర్వాత కూడా డబ్బు కాకుండా వస్తువే తీసుకోవడం విచిత్రమే అనిపించింది. వెంటనే ఒప్పుకున్నారు.

తను ముప్పయి వెయిల అప్పు తీసుకుంటే రెండేండ్ల తర్వాత జీబు మిగిలినా అరవై వెయిల అప్పు కూడా మిగులుతుంది. ఇలాగైతే జీబు మిగలదు. అప్పు మిగలదు. రెండేండ్ల తరువాత జీబు వ్యాల్యూ కూడా అంతే ఉంటుంది. ఇక తనకు నష్టమేంటీ అను కున్నాడు.

కాయితాలు రాతలు పూర్తయ్యాయి. రోజూ సాయంత్రం పూట జీబును బుచ్చిరెడ్డి ఇంటి ముందుం చాలి. తెల్లారినాక తీసుకెళ్లాలి. చిన్నచిన్న రిపేర్లు కాదు గానీ గ్యారేజీ రిపేర్లు బుచ్చిరెడ్డే పెట్టుకోవాలి. ఇలా ఒప్పందం కుదిరిందో లేదో కమాండర్ జీబు ఇంటి ముందుకు వచ్చింది. అది పొద్దంతా నాయిన చేతుల్లో రాత్రిపూట బుచ్చిరెడ్డి గ్యారేజ్‌లో నివాసం చేసుకుంది.

రాత్రికి రాత్రి కడుపు నొచ్చినా, పాణం బాగా లేకున్నా, బరువు మనుషులు నొప్పులు పడినా, పెండ్లీ లకు, పేరంటాలకు జీబుకు గిరాకీ దొరికేది. రెండేండ్ల లో నాయిన నలుగురికి పనిని నేర్పించి విడిచిపెట్టాడు. వారిని దొరకబట్టుకుని ఇలాగే జీబులు, ఆటోలు కొనిచ్చి తన స్కీంలో చేర్చుకున్నాడు బుచ్చిరెడ్డి. నాయిన మంచితనాన్ని పెట్టుబడిలా మార్చుకున్నాక అతడి ఇల్లు గ్యారేజి అయింది. బినామీ పేర్లు, వేరువేరు స్కీంలతో బేంకు అత్తగారి ఇల్లయింది రెడ్డికి.

రోజురోజుకు పోటీ పెరిగింది. ఎవరితోనోకాదు. యజమానితో... తను పనినేర్పిన కుర్రాళ్లతో, గ్రామీణ బ్యాంకులోని స్కీములతో! ఆ పరుగులతోనే రెండేండ్లు గడిచాయి. మొదటిరోజుల్లో వెనకేసుకున్న ఐదూ పదీ చివరి రోజుల్లో గిరాకీ సరిగ్గా తగలక బేంకు అప్పుకు కలపవలసి వచ్చింది. కూడబెట్టిన డబ్బు ఎక్కడికి నడవాలో అక్కడికి నడిచింది.

రెండేండ్లు గడిచినాక గానీ అసలు సూత్రం బోధ పడలేదు. మరో ఏడాదైతే బుచ్చిరెడ్డి బాకీ కూడా ఖతం. తను చేసిన శ్రమకు లాభంగా జీబు మిగులుతుండెనని. రెండేండ్ల శ్రమ తర్వాత తను మళ్లీ మొదటికే వచ్చా డని. బుచ్చిరెడ్డి మాత్రం పెట్టిన పెట్టుబడిని మిత్తీతో... మిత్తికి మిత్తీతో వసూలు చేసుకున్నడని.

ఇప్పుడు మరో వెయ్యి ఎక్కువిస్తేనే కిరాయికిస్తా నని ఖచ్చితంగా చెప్పాడు బుచ్చిరెడ్డి. జీబు చేతులు మారాలన్నది అసలు విషయం. ఉన్నదే ఎల్లుతలేదు. మరో వెయ్యి ఎక్కడి నుండి తెచ్చేదని నాయిన జార విడిచాడు.

''ఓ పోడా... జర మెల్లెగ పోనీ... ఊరచ్చింది. ఎవ లన్న పిల్లనో తల్లినో గుద్దినవంటే దండుగ జురుమానకు నీ ఇల్లు సాలది,'' అదిలించింది తిరుమలవ్వ.

టేపు బందుజేసి స్లో చేశాడు కైలాబ్. అతడికి ఆశగా ఉంది. కనీసం నలుగురైదుగురు ఎక్కకపోతరా అనుకుంటుండగానే పందిపిల్ల ఒకటి పరుగెత్తుకు వచ్చింది. ఎనుక పయ్య కింద పడి గావుకేక పెట్టింది.

''ఎరుకలోల్లు వచ్చిరాంటే ఈపుకు సున్నం బెడుతరు. ఉరుకనీ...'' యాదగిరి అన్నాడు. కైలాబ్‌కు భయమే చుట్టుకుంది. వెనుక ఎవరివో అరుపులు విని పించాయి. తిరిగి చూడకుండా వేగాన్ని పెంచాడు.

''ఆ... నువు ఆర్టీసీల ఇట్లజేస్తే ఇంటికే తోలి త్తరు,'' ఒక టీచర్ అన్నాడు. ''ఆ పని మొన్ననే చేశారు. లైసెన్స్‌లో ఏదో తప్పు దొరికిందట,'' మరో టీచర్ ఎత్తి పొడిచాడు.

''పాపం... రెండేండ్ల పొద్దు జేసిండు. పని చూడా లినేగనీ కాయిదం మీద ఏముందయ్యా,'' సత్తయ్య సానుభూతి.

''ఎన్నేండ్లయితేంది...? సర్కారుకు సాలా మూలా!'' తిరుమలవ్వ అన్నది. మాటలు వింటూనే దారులు వెదుకుతున్నాడు కైలాబ్. జనం నడుస్తున్నారు. వత్తున్నారు పోతున్నారు. జీబు కొరకు మాత్రం ఎవరూ లేరు. దిగులుగా, భయంగా గంగమ్మవాగు దాటాడు కైలాబ్.

చేతిలో పైసలేక నాయినకు మందులు కొన లేదు. కారణమేమిటో కానీ జరం అందుకుంది. ఇవ్వాల్ల గూడ తేలేడేమో! గంపెడు ఆశను చూపించి వచ్చాడు ఇంటివద్ద. ఇంటికెళ్లడానికీ మొహం చెల్లదేమో!

పాట మళ్లీ మొదలయింది. తొవ్వ సాగుతనే వుంది. సర్వాయిపల్లి, బొప్పారం, గొల్లపల్లి, డాంబర్ రోడ్... ఎక్కడా ఒక్క పురుగు లేదు. ఆశ నిరాశయింది. పెద్ద దుకాండ్ల చిట్టీ ఇచ్చి ముందుకు సాగాడు కైలాబ్.

''ఆగాగు. కాలేజి వచ్చింది,'' పిల్లలిద్దరూ దిగి చిల్లర పైసలిచ్చి గేటు దాటారు. లెక్కించుకుంటే రూపాయి తక్కువ. నిలబెట్టి అడిగితే మళ్లీ జీబెక్కరు. అపురూపంగా జేబులో వేసుకుని ముందుకు పోని చ్చాడు. ప్యాట్లో పూర్తి ఖాళీ అయింది. డిజిల్ మందం రాలేదు. బస్టాండ్‌లో పెడితే లైనులో రావాలన్నారు. ఏడెనిమిది వరకూ అన్నీ ప్యాసింజర్ జీబులే. వాటిని డామినేట్ చేసి దాట వేసేందుకు ఆటోలు. అన్నింటి మీదా బ్యాంకు ఆర్థిక సహాయంతో అన్న ముద్రలు. ఓనర్లు ఎక్కడో ఉన్నారు. కాళ్లు రెక్కల్ని నమ్ముకున్నొల్లు కండ్లల్లో వత్తులేసుకుని 'సిరిసిల్ల... సిరిసిల్ల' అని అరుస్తుండ్రు. అబ్బ... ఇంట్ల కూసుండి బొమ్మలాట ఆడిత్తండ్రు అనుకున్నాడు.

అక్కడుంటే పొద్దుగూకినా గిరాకీ రాని పరిస్థితి. ఏదో గుర్తొచ్చి మార్కెట్‌వైపు వెళ్లి ఆపాడు కైలాబ్. ఐదు నిమిషాల్లో జీబు నిండింది. కొందరిని ముందె కూర్చో బెట్టుకున్నాడు. తనకు జానెడు మాత్రమే జాగ నుంచు కున్నాడు. కూరగాయ గంపల్ని కొన్నింటిని టాపుపై వేశాడు. కొందరు వేళాడుతూ నిలబడ్డారు. అందరూ డైరెక్టే. కైలాబ్‌కు పట్టరాని సంతోషమచ్చింది. నాలుగు ట్రిప్పులు ఇట్ల దొరికితే రెండుగాదు పదైనా కట్టచ్చు కిరాయి అనుకున్నాడు.

జీబు రాగెట్లపల్లె మలుపు తిరిగింది. ఎంత వేగంగా ఎక్స్‌లేటర్‌ను నొక్కాడో అంతకంటే వేగంగా బ్రేకు నొక్కాడు. జీబు కిర్రుమంది. లోపల ఉన్నోళ్లు గుద్దుకున్నారు. నిలబడ్డోళ్లు తూలిపడబోయి నిలదొక్కు కున్నారు.

''ఓ... బోషిడికే... సంపుతావురా...?'' ఎవరో అరిచారు.

''వీని తలపండు వలుగ. వీనినాం నరుక. వీని మొదలార. పుర్రె వలుగుతుండె...'' ఎవరినో గానీ ఎవరో తిడుతున్నారు. అడ్డువచ్చిన లారీని తప్పించి ముందుకు కదిలింది జీబు. వెనుక నుండి తరుముకొత్తున్నట్టు లోకల్ సర్వీస్, అది ముందు పడిందంటే తొవ్వపొంట ఒక్కరు దొరుకరు. స్పీడందుకుంది జీబు. మధ్య మధ్య ఎక్కుడూ, దిగుడూ. యాడ ఎక్కిత్తవు, నెత్తిమీద ఎక్కిచ్చుకో అంటూ ప్యాసింజర్ల సూటిపోటి మాటలు... చిల్లర పైసలకాడ గొడవలు... మొత్తం మీద సిరిసిల్లకు చేరింది జీబు.

కొద్దిగా తెరిపి దొరికింది. తేలిగ్గా ఊపిరి పీల్చు కున్నాడు కైలాబ్. జీబు దిగాడో లేదో మళ్లీ జనం చుట్టు కున్నారు. మలిపి పెట్టగానే నిండా నిండారు. చాయి తాగి ఎక్కి కూర్చున్నాడు. జాగ జానెడు కూడా మిగల్లేదు కూర్చోవడానికి. సదురుకొని కూర్చున్నాడు.

అనుకోకుండా వచ్చిన అవకాశానికి ఆనందంగా ఉంది. అబ్బ! వారానికి మూడురోజులు ఇట్ల నడిచినా మంచిగుంటది అనుకున్నాడు. ఎందుకో కాని తను చేసింది కరక్టేనన్న పూర్తి నమ్మకం ఏర్పడింది. ఇయ్యాల్ల రేపు రెండురోజుల కిరాయి బుచ్చిరెడ్డి మొహాన కొడుత అనుకున్నాడు.

పెద్దూరు మలుపుకాడ జీబుకు సడన్‌బ్రేకులు పడ్డాయి. మళ్లీ తిట్లు, మూలుగులు. అవేవీ వినిపిం

చడం లేదు కైలాబ్‌కు. ఎదురుగా రోడ్డు పక్కగా నిల బెట్టిన తెల్లకారు మాత్రమే కనిపిస్తోంది. కారులోంచి తన వైపు విలాసంగా చూస్తున్న ఆర్.టి.ఓ మాత్రమే కని పిస్తున్నాడు.

"ఇగ నీ పని అయినట్టే. ఆఫీసర్ కొత్తగచ్చిండు," ఎవరో అన్నారు.

"అవును. ఎన్నో అవసరాలుంటయి. చెయ్యి తిరుగాలెగదా..." ఎవరో నవ్వారు. పీర్పుకపోయిన మొహంతో ఆర్.సి. బుక్కు, లైసెన్స్‌ను పట్టుకుని జేబును తడుముకుంటూ వెళ్లాడు కైలాబ్. సింహాసనం మీద కూర్చున్న మహారాజులా కాలు కూడా కదుపలేదు ఆర్.టి.ఓ. సగం తెరిచిన కిటికీలోంచే లావాదేవీలు జరిగాయి. అరగంట బతిమాలినాకగానీ మెత్తబడలేదు ఆఫీసర్. జేబులో ఉన్న నోట్లు చిల్లర అన్ని చదివించు కున్నాక గానీ ఆర్.సి. బుక్ చేతికి రాలేదు.

ఈలోగా ప్యాసింజర్లు వచ్చిన బస్సులో ఎక్కి కూర్చున్నారు. బస్సు ఎల్లిపోయింది. ఆర్‌టిఓ తావు తప్ప దీశాడు. ఉత్త చేతులతో ఊపుకుంట ఊపుకుంట జీబు దగ్గరికచ్చాడు కైలాబ్. ఖాళీ జీబు, ఖాళీజేబు. ఏడుపొ చ్చింది. 'ఇంక కేసు రాయలేదు. నయమయింది' అను కుంటూ జీబెక్కాడు. ఎటు వెళ్లాలో తెలియడంలేదు. కాసేపు ఆలోచించి సిరిసిల్లవైపే మరల్చాడు. ఏదో ఒకటి చెయ్యాలి. పొద్దుపోతోంది అనుకున్నాడు.

అంబటాల్ల దాటింది. ఆకలి మొదలయింది. చాయనీళ్లకు గూడా పైసల్లేవు. అసలు కథ జీబులో డీజిల్ లేదు. తను ఖాళీ కడుపుతో రెండు రోజులైనా ఉండగలడు గానీ ఖాళీ టాంక్‌తో జీబు అడుగు కదల లేదు. రోడ్డుపక్కగా ఆపి, "గొల్లపల్లి... వన్‌పల్లి... వన్ పల్లి..." అన్నాడు. వన్‌పల్లి జంగల్ ఏరియా. అటు బస్సులు ఉండవు. ప్యాసింజర్లు ఎవరైనా ఉంటారని అన్నాడు. ఈ మాటలు మిగతా జీబుల వాళ్లకు నవ్వును తెప్పించాయి.

కొంతమంది అతడివైపు నమ్మలేనట్టు చూశారు. మరికొందరు నిజమేనా అని అడిగి తెలుసుకున్నాక గానీ నమ్మలేదు. వాళ్లు ఎందుకలా అడుగుతున్నారో తెలుసు కైలాబ్‌కు. అటు రోడ్డే సరిగ్గా లేదు. జీబులు తిరుగవు. ఎప్పుడో వచ్చే షటిల్ సర్వీస్. ఆరోజు అంగడి. లంబ లోళ్లు సరుకుల కొరకు ఆనాడే బయటకు వస్తారు.

"వన్‌పల్లి... వన్‌పల్లి..." మరోసారి అన్నాడు కైలాబ్. బస్సులేని తొవ్వ. యాళ్లగాని యాళ్ల. రెండు నిమిషాల్లో నిండారు. కైలాబ్‌కు తెలుసు. అలా నిండు తారని. కాశీకి బోతే కాటికేమోగానీ వన్‌పల్లికి బోతే వెన్ను బొక్కలిరుగుతయని జీబు డ్రైవర్లనుకుంటారని గూడా తెలుసు. గతిలేక ఆ రూటుకు పెట్టాడు.

జేబు నిండింది. కదలాలి. కానీ కదలదు. ప్యాసిం జర్లు పైసలు ముందుగా ఇయ్యరు. దిగినాకనే! ఇప్పుడు డీజిల్ ఎట్లా...? మహా అయితే రెండుమూడు కిలో మీటర్లు పోతది. ఆలోచిస్తూ స్టార్ట్ చేశాడు. ముందుకు పోనిచ్చి బంక్ ముందు ఆపాడు. రెండు వందల డీజిల్ పోయించాడు.

"అన్నా చిల్లర్లెవ్వు. పైసలియ్యండ్రీ," వెనక్కి వచ్చి అన్నాడు. కొందరు గులిగారు. కొందరు పారిపోతున్నమా అన్నారు. లంబడోళ్లు. ఆడామగా. కాకిరిబీకిరి ఒర్రి ఇయ్యనైతే ఇచ్చారు. డీజిల్‌కు పోంగా రెండు ఐదు రూపాయల బిళ్లలు మిగిలినాయి. జేబులో వేసుకుని స్టార్ట్ చేశాడు.

దిగేటోళ్లు దిగుతున్నారు. ఒకరిద్దరు ఎక్కుతు న్నారు. తొవ్వపొంట పోతుంటే గుండెలో కలుక్కు మంటోంది. ఏదేదో యాదికస్తుంది. టేపు కూడా పెట్ట లేదు. ఆకలితో కడుపూ బాధతో మొహం మాడిపో తున్నాయి.

డాంబర్ రోడ్డు నుంచి మట్టిరోడ్డుకు మలిగేటప్ప టికి సిరిసిల్లలో ఎక్కిన వన్‌పెల్లి ప్యాసింజర్లే వున్నారు. పదమూడుమంది. చాల్లే ఇదే నయం అను కున్నాడు. వచ్చేప్పుడు కనీసం ఇరువైమంది ఎక్కుతరు. ఇది మాత్రం ఖాయం. కాకపోతే కంకరరాళ్లు టైర్లకు కొట్ట కుండ కాపాడాలె. అనుకుంటుండగానే జీబుకు బ్రేకులు పడ్డాయి.

మఫ్టీలో ఉన్న నలుగురు కానిస్టేబిల్స్ జీబు దగ్గరి కొచ్చారు. వారిని తేలిగ్గానే గుర్తుపట్టి భయం భయంగానే దిగాడు కైలాబ్. ఎందుకు ఆపారో అర్థమయింది.

"పెట్రోలింగ్ బోవాలె. స్టేషన్ దగ్గరుండు. అర గంటల తిరిగొస్తం," చెప్పినట్టుగా కాకుండా ఆర్డర్ వేస్తు న్నట్టుగా అని మిగతా వారందరినీ దించారు. కైలాబ్ ఏదో చెప్పబోయాడు. బతిమాలబోయాడు. బుచ్చిరెడ్డికి తనకు కుదిరిన కాంట్రాక్టు గురించి చెప్పబోయాడు. జీబు తనది కాదని వివరించబోయాడు.

వాళ్లు ఏదీ వినలేదు. దుమ్ము లేపుకుంటూ అడవిలో మాయమైపోయింది జీబు. మా డబ్బు మాకు తిరిగియ్యమని కొట్లాట మొదలయింది. ఎంత సర్ది చెప్పినా వినరు. చేసేదేంలేక తొవ్వలనే కూలబడి పోయాడు కైలాబ్. మనిషికో తిట్టు. మన్ను దుమ్ము.

కండ్లు చెవులు మూసుకున్నాడు కైలాబ్. గులుక్కుంటూ రోడ్డువైపు వెళ్లిపోయారు జనం.

కాళ్లీడ్చుకుంటూ స్టేషన్ దగ్గరికచ్చి పొద్దంతా పడిగాపులు గాశాడు కైలాబ్. జీబు జాడలేదు. పత్తలేదు. ఆకలి ఎక్కువయింది. జేబులో చిల్లర ఉన్నాయిగానీ ఖర్చు పెట్టాలనిపించలేదు. జీబులో డీజిల్ ఉంటుందో లేదో తెలియదు. వచ్చినాక అరలీటరు పోసేసైనా ఇల్లు చేరవచ్చుననుకున్నాడు. ఇల్లు చేరినాక బుచ్చిరెడ్డి కిరాయి ఎట్లా అనే ఆలోచన కూడా వచ్చింది. రోజూ రెండు వందలు. ఇయ్యకపోతే బొబ్బ, బద్ది, బదునాం. మొదటిరోజే ఎగనామమని చెడ్డపేరు.

తొక్కులాటలనే పొద్దుగూకింది. అప్పటిగ్గాని జీబు రాలేదు. నిండా దుమ్ము. ఎవరినో పట్టుకచ్చారు. అనుమానంగానే జీబు దగ్గరికెళ్లాడు. చారెడో దోసెడో ఉన్నట్టుంది డీజిల్. ఇంటికైతే చేరచ్చులే అనుకున్నాడు.

జీబు చాల్ చేశాడు కైలాబ్. రెండుమూడుసార్లు మూల్గి చాలయింది. ఇయ్యల్ల ఒక్కనాటితో ఒడిసేది గాదు. రేపకల్లా ఇది ఇంతే! యాడాది ముచ్చట. మొదలే మొగురం గాలేదు. కొనదూలమైతదా...? ఇది నా తండ్రిని తొక్కింది. నన్ను తొక్కాలని చూస్తోంది. బ్యాంకులు, పెత్తందార్లు పాముల్ని వదిలినట్టు వీటిని వదిలిండ్రు. మేం పాలువోసి పెంచుతున్నం. రోజురోజు కిరాయి యాడనుంచి కట్టాలె...? కట్టకపోతే కాయిదా లుండే! పంచాదులు, కేసులు. ఎలా...?

కైలాబ్‌కు మనసు ఇరిగింది. జీబు మీదగాదు కానీ దాని వెనుక ఉన్న మనుషులు... వారి వెనుక వున్న సంస్థలూ గొట్టాలు బెట్టి రక్తాలు పీల్చే దోమల్లా కనిపించారు. దోమ చిక్కుతుంది. నలిపేస్తాం. ఈ దొర చిక్కడే! మననే నలిపేస్తాడు. ఏదో జ్ఞానబోధ అయితున్నట్టుగా అనిపించింది. ఇంతకింతకూ జీబు మీద కసి పెరుగుతోంది.

జీబును హోటల్ ముందు ఆపి టిఫిన్ చేశాడు. అప్పటికి చీకటిపడింది. ఇంటివైపు మరలుతుంటే ప్యాసింజర్లు ఆపి ఎక్కుతామన్నారు. రాత్రిపూట గాబట్టి ఎక్కువ పైసలిత్తామన్నారు. దాదాపు పదిహేను ఇరువై మంది. వద్దని చెప్పి ముందుకు కదిలాడు. దుబ్బమీది సేటు పొద్దున ఇచ్చిన లిస్టుల తాలూకు సామాన్లు తెచ్చి చేతిలో ఇరవైనోటు పెట్టబోయాడు. వాటిని గూడా జీబులో పెట్టనియ్యలేదు. ఖాళీ జీబుతో నర్రెంగల్ల కచ్చాడు కైలాబ్. పటపట పండ్లు గొరికాడు.

జీబు దిగి ముందుకచ్చి నిలబడ్డాడు కైలాబ్. హెడ్‌లైట్ వెలుతురుకు తోడు చిక్కటి వెన్నెల. "దీనికి స్వామి భక్తి ఎక్కువ. కాలబెట్టినా, గుట్ట మీది నుంచి కిందికి నూకినా ఇన్సూరెన్స్ రూపంలో ఇంటిముందు తేలుతది, పాణమొక్కటి లేదన్నట్టుగానీ పాణాలకు పాణాలు దీత్తది," కోపంగా అంటూ బానెట్ ఎత్తాడు.

యంత్రమర్మం తెలిసినోడు. ఎక్కడేం చేశాడో గానీ అరగంటలో పొగ లేచింది. శవం కాలిన కమురు వాసన. ఎందరి రక్తాలనో తాగి చీకట్లో ముడుచుకు పన్న రక్త పెంజెరలా జీబు నడితొవ్వలో.

"ఇది కదలాలంటే వెయిలు గావాలె. ఇది మేజర్ రిపేర్. రెడ్డి ఖాతాలకే పోతుంది. సావని కొడుకు. పాముల్ని ఇడిసి పెడ్తాన్రా బచ్చా నా కొడుకుల్లారా... తెలువక పడిగెనీడలకు బోవడితిమి... రెండుమూడు సార్లు గిట్ల జేత్తే రోగం కుదురుతది కొడుకులకు..." వదురుతూ ఇంటివైపు కదిలాడు కైలాబ్.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 10 నవంబర్ 2002*

